ముందుమాట:



# బిట్వీన్ ది లైన్స్

సమాజాన్ని మించిన బడి లేదు. సాటి మనిషిని మించిన గురువు లేడు. మనకు తారసపడే రకరకాల సంఘటనలకు మించిన పాఠాలు లేవు.

దేవుడనేవాడు అసలున్నాడో లేదో మనకు తెలియదు. ఒక ఊహ. ఆ ఊహకు ఒక అస్తిత్వాన్ని సృష్టించి ప్రతి మనిషిలోనూ వాడున్నాడని మాత్రం మనం నమ్ముతుంటాం. దేవుడు ప్రతి మనిషిలో ఉన్నాడో లేదో కూడా నాకు తెలియదు. కానీ, ప్రతి మనిషిలోనూ ఒక 'గురువు' మాత్రం తప్పకుండా ఉంటాడు.

'గురువు' అనే పదం యొక్క రూపలావణ్య విశేషాలు, అస్తిత్వం ఊహ కాదు. మన చర్మ చక్షువులకు, కర్మేంద్రియాలకు అనుభవంలో ఉండేవే! అలాంటి గురువు- ప్రత్యక్షంగానూ పరోక్షంగానూ మనకు తారసపడే, కనే వినే ప్రతి మనిషిలోనూ తప్పకుండా ఉంటాడు. ప్రతి వ్యక్తిలోనూ మనకు నచ్చిన, నచ్చని గుణ విశేషం ఏదో ఒకటి కనిపిస్తూ ఉంటుంది. నచ్చిన వాటిని తీసుకోవడం.. నచ్చని వాటికి దూరంగా ఉండడం మాత్రమే మనం చేయదగినది. అలాగే, ప్రతి సంఘటనలోనూ గురుత్వాంశ కలిగిన విషయం తప్పకుండా ఉంటుంది. అయితే మనకు ఎంతగా గ్రహింపునకు వస్తుంది, మనం దాని నుంచి ఎంతగా నేర్చుకుంటున్నాం అనేది మన మీద ఆధారపడి ఉంటుంది. మనలోని జిజ్ఞాసువు మీద ఆధారపడి ఉంటుంది. దృక్కోణం మీద ఆధారపడి ఉంటుంది. అదే మనల్ని తీర్చిదిద్దుతుంది. నచ్చిన గుణాల్ని మన భావజాలానికి అనుగుణంగా మెరుగుపరచుకుని అలవాటు చేసుకోవాలి. నచ్చని గుణాల జోలికి వెళ్లకుండా మనల్ని మనం నియంత్రించుకోవాలి. అదే జీవితం.

'ఎంత మాత్రమున ఎవ్వరు తలచిన అంతమాత్రమే నీవు.. అంతరాంతరము లెంచి చూడ పిండంతే నిప్పటి యన్నట్లు..' అన్న స్తుతిలో పదకవితా పితామహుడు అన్నమయ్య ఆవిష్కరించినది కేవలం వేంకటేశ్వర తత్వమే అనుకుంటే తప్పు. అది మనందరికీ నిత్యస్మరణీయమైన జీవన వేదం. మనకు తారసపడే ప్రతి వ్యక్తికీ, ప్రతి సందర్భానికీ, చూసే ప్రతి సంఘటనకు ఇది వర్తిస్తుంది. సంఘటనల విషయంలో మనం గమనించే దృక్కోణం ముఖ్యమైనది. ఒక సంఘటనలో 'వార్త' ఉన్నదో లేదో గ్రహించగల నేర్పును 'news nose' అంటారని నేను నేర్చుకున్నాను. ఒక సంఘటనలో 'పాఠం' ఉన్నదో లేదో గ్రహించడం learner గా నేను సాధన చేస్తున్నాను. విలక్షణత అనేదే వార్తకు మౌలిక లక్షణం. విలక్షణమైన, లోకరీతికి భిన్నమైన, చాలా అరుదైన కొన్ని సంఘటనలు తారసపడినప్పుడు వాటినుంచి నేర్చుకోవాల్సిన పాఠం ఉందనిపిస్తుంది. మనం నేర్చుకునే పాఠాన్ని ఇతరులతోనూ పంచుకోవాలని కూడా అనిపిస్తుంది. దైనందిన వార్తాంశాలలో అలాంటివి కనిపించినప్పుడు నాకున్న దృక్కోణానికి, పరిమితమైన జ్ఞానానికి అవగాహన అయినంత మేరకు అందరితోనూ పంచుకునే ప్రయత్నం ఈ కథనాలు. ఇవి కేవలం వ్యాసాలు కాదు.. నేను నేర్చుకున్న పాఠాలు.

Today's newspaper is tomorrow's waste paper అనే మాట కటువుగా ఉన్నా, ఆ నిజాన్ని కాదనలేం. అలాగే ఇవాల్టి వార్తలు రేపటికి పాచిపోతాయి. ఎంత సంచలనమైన వార్తయినా కావొచ్చు గాక.. కాలక్రమంలో దానిని మనం మరచిపోతాం. కానీ వార్తగా

కంటె 'పాఠం'గా నేర్వవలసిన అంశాలు కొన్ని దొర్లుతుంటాయి. అవి కాలగర్భంలో కలసిపో కూడదు. వాటికి సార్వజనీనత మాత్రమే కాదు, సార్వకాలీనత కూడా ఉంటుంది. ఆ పాఠాలను ఎప్పటికీ మనం, అప్పుడప్పుడూ చదువుకుంటూ ఉండాలి. వాటినుంచి కొత్తగా నేర్చుకుంటూ ఉండాలి. మనల్ని మనం కొత్తగా దిద్దుకుంటూ ఉండాలి. అలా పాఠాలుగా నిలవదగిన వార్తాంశాలకు నిశ్చితమైన రూపం ఇవ్వాలనే ఆలోచనకు నిదర్శనమే ఈ 'మునివాక్యం'. పాత్రికేయ రంగంలో ఉన్నందుకు ఒక నిర్దిష్టమైన పనికి రూపం ఇవ్వాలనే సంకల్పం.

జర్నలిస్టుగా నేను ఎప్పుడు పురుడుపోసుకున్నాను, అక్షరాభ్యాసం చేశాను, ఎప్పుడు నిత్యవిద్యార్థిగా రూపుదిద్దుకున్నాను.. అనేది ఇదమిత్థంగా తేల్చి చెప్పడం కష్టం. కాస్త అతిశయంగా సరదాగా చెప్పాలంటే.. పువ్వు విరబూసిన తర్వాత.. అది ఎప్పుడు వికసించింది అంటే ఏం చెప్పగలం? మొగ్గనుంచి పువ్వు కావడంలో ఏ ఘడియలో అలా జరిగిందని నిర్ణయించగలం? నా జర్నలిజం కూడా అంతే. మా నాన్న ఆదర్శిని ఎల్లయ్య జర్నలిస్టు కావడమే నాకు దక్కిన భాగ్యం. ఆ స్ఫూర్తితోనే, ఉత్సాహంతోనే జర్నలిస్టు అయ్యాను. ఇది కేవలం బతుకు తెరువు కాకుండా, ఈ పనిచేస్తుండడం వలన చాలా సందర్భాలలో మంచి తృప్తిని పొందగలిగాను. ప్రధాన స్రవంతి మీడియా సంస్థల్లో మూడున్నర దశాబ్దాలకు పైబడిన సుదీర్ఘ వృత్తిగత, ఆత్మగత ప్రస్థానానికి పునాది 'ఈనాడు' లోనిదే.

'Between the lines' అనేది జర్నలిజం పాఠంగా, వేదంగా నేర్పిన గురువులు బూదరాజు రాధాకృష్ణ, తల్లాప్రగడ సత్యనారాయణమూర్తి. 'మీరు జర్నలిస్టులు సార్.. మేం పామరులం.. ఒక వ్యవహారం జరిగితే మా బోటి పామరులు అర్థం చేసుకున్నట్టుగా మీరు చూడకూడదు సార్. బిట్వీన్ ది లైన్స్ చూడాలి మీరు..'' అంటూ చిరునవ్వుతో పాత్రికేయ జీవితాన్ని దిద్దిన మహనీయుడు తల్లాప్రగడ. నా జీవితంలో నేనెరిగిన అత్యద్భుతమైన జ్ఞాన సంపన్నుడు, జ్ఞానం వినయాన్ని ఇస్తుందనే సిద్ధాంతానికి మానవరూపం ఆయన. అంతటి వ్యక్తి.. 'మేం పామరులం సార్.. మీరు బిట్వీన్ ది లైన్స్ చూడాలి సార్..' అంటూ జర్నలిజం మౌలికమైన బాధ్యతను మా మెదళ్లలోకి చొప్పించారు. నిత్యస్మరణం వల్ల అది సహజ లక్షణంగా మారిపోయింది నాకు. దానివల్ల ప్రశాంతత లేకుండాపోయిన అనుభవాలు, నన్ను నేను నిందించుకున్న సందర్భాలు కొల్లలు.

'బిట్వీన్ ది లైన్స్' అనేది నా బుద్ధిగా స్థిరపడింది. కానీ, ఆ బుద్ధి వల్ల నేను లాభపడిందే ఎక్కువ. ఎవరి వ్యవహారసరళి పట్ల అసంతృప్తికి లోనుకాకుండా, ఎవ్వరి

తోనైనా ప్రేమగా ఉండగల వ్యక్తిత్వాన్ని నాకు అలవరచింది. వ్యక్తుల ప్రవర్తనతో అసంతృప్తి, కోపం వచ్చినప్పుడు దాన్ని క్షణికంగా మార్చే బుద్ధి ఏర్పడింది. ఆ బుద్ధే అలాంటి ప్రవర్తనలో వారికి ఒక హేతువు ఉంటుందని తెలియజెబుతుండేది. ప్రతి సంఘటనను వార్తల్లో కనిపించే కోణంలో కాకుండా ఇంకో రకంగా అర్థం చేసుకోమని నన్ను ప్రేరేపిస్తుంటుంది. వెంటపడుతుంది. మెలిపెడుతుంది. మథనపెడుతుంది. అందులో ఉన్న పాఠాన్ని నేర్చుకోమని బెత్తం పట్టుకుంటుంది.

మీడియా ప్రజలతో ఆడుకుంటూ ఉంటుంది. వారిలోని సహజత్వాన్ని చంపేస్తుంటుంది. ఏది మంచో ఏది చెడో ప్రజలు తమంతగా నిర్ణయించుకునేలోగా వారి బుర్రలోకి చొప్పించడానికి ప్రయత్నిస్తుంటుంది. మనం సొంత ఆలోచన చేసే లోగానే ఒక భావం మనలోకి చొరబడిపోతుంది. మీడియా బహురూపాలుగా రకరకాల పునాదుల మీద అవతరించి ఉన్న ఈ రోజుల్లో భిన్నమైన కోణాలను, పార్శ్వాలను మనం ఆశించలేం. అందుకే అలా బిట్వీన్ ది లైన్స్ గా నేను గమనించిన, నాకు స్ఫురించిన అంశాలను 'మునివాక్యం' రూపంలో చెప్పాలని అనుకున్నాను. నేను నేర్చుకునే పాఠాలనే పదిమందికీ ప్రతిపాదించాలని ప్రయత్నించాను.

పాపులర్ గా చదివించుకోవడానికి రాయదగిన అంశాలు చాలా ఉంటాయి. రాజకీయాలు, సినిమా వంటివి. వాటిమీద ప్రతిపాదించే ఏ ఆలోచన అయినా అసంబద్ధమైన చర్చోపచర్చలకు, వివాదాలకు దారితీస్తుంది తప్ప.. ఒక తుదినిర్ణయానికి మనల్ని రానివ్వదు. అసలు అంశం మరుగున పడిపోయేలా ఈ చర్చోపచర్చలు అదుపు తప్పి కులమతాలు, వర్గాలు, పార్టీల గీతలమీద నడవడం ప్రారంభిస్తాయి. అందుకే ఆ అంశాలనే స్పృశించదలచుకోలేదు. అవి అనివార్యంగా మన చుట్టూ పరివేష్టించి ఉండనే ఉంటాయి. చాలా చిన్న జీవితం మనది. చిన్న బుర్ర మనది. అలాంటివన్నీ సింహభాగం ఆక్రమించేయగా మిగిలిన దానిలో.. మానవీయ సామాజిక కోణాల్లో స్పృశించదగిన వాటిని మాత్రమే ఎన్నుకుంటున్నాను. అందులో బిట్వీన్ ది లైన్స్ దృక్కోణం ద్వారా నా బుద్ధిని మెరుగుపరచుకునే ప్రయత్నం చేస్తున్నాను.

ఫ్రీలాన్స్ జర్నలిస్టుగా ఒక కాలమ్ నిర్వహించడంలో అనేక సాధకబాధకాలు ఉంటాయి. పత్రికల స్వరూప స్వభావాలు వివిధ పునాదుల మీదికి కుదించుకుపోయిన ఈ రోజుల్లో సొంత భావాలను రాయడానికి స్వేచ్ఛ పరిమితంగా ఉంటుంది. ప్రభువు మనసెరిగి నడుచుకోవడమనే అనుభవ పాఠాలు మనం చెప్పదలచుకున్న విషయాన్ని చిత్రిక పట్టేసి, మనం తలచిన దానిని భిన్నమైన రూపంలోకి ఆవిష్కరిస్తుంటాయి.

మునివాక్యం కథనాల విషయంలో నాకు స్వేచ్ఛ లభించింది. గ్రేట్ ఆంధ్ర వారపత్రిక సంపాదకులు అరికట్ల వెంకట్ తో నా ఆలోచన పంచుకున్నప్పుడు ఆయన తప్పకుండా రాయమని అన్నారు. నా భావాలను ప్రతిపాదించే క్రమంలో వాటిని మరోరకంగా చెప్పాలని ఏనాడూ అడగలేదు. అక్షరమైనా మార్చాలని సూచించలేదు. అలాంటి స్వేచ్ఛ వర్తమాన జర్నలిజం ప్రపంచంలో ఒక కుందేటి కొమ్ము! అందుకు వెంకట్ కు కృతజ్ఞతలు. ఈ కథనాలకు ఆదరణ కూడా బహుళంగా, విస్తృతంగా దక్కింది. ఈ కథనాల్లోని అంశాలకు సార్వజనీనత మాత్రమే కాదు, ప్రతిపాదనలకు సార్వకాలీనత కూడా ఉందనే నమ్మకం దక్కింది. ఆ నేపథ్యంలో పుస్తకంగా తీసుకురావడానికి ఆర్థిక సహాయం కూడా అందించి నందుకు అరికట్ల వెంకట్ కు బహుధా ధన్యవాదాలు.

ఈ కథనాల్లో అసంబద్ధత, అపసవ్యత ఏమైనా ఉంటే అందుకు పూర్తి బాధ్యుణ్ని నేను. మంచి సంగతి ఏమైనా ఉంటే.. ఆ ఘనత, అవి రాయడానికి ప్రేరణ ఇచ్చిన వ్యక్తులు, సంఘటనలది అని సవినయంగా మనవి చేసుకుంటున్నాను.

మీ

కె.ఎ. మునిసురేష్ పిళ్లై

ఫ్లాట్ నెంబర్ 501, అన్నమయ్య రెసిడెన్సీ, ప్లాట్ నెంబర్ 727, రోడ్ నెం.38, అయ్యప్ప సొసైటీ, మాధాపూర్, హైదరాబాద్-81
పిచ్చాటూరు రోడ్డు, శివనాధపురం గ్రామం, తొట్టంబేడు మండలం, శ్రీకాళహస్తి హెచ్.ఓ. - 517 643
mobile: 99594 88088, email: kamspillai@gmail.com